క్లుప్తంగా

సర్వసభ్య సమావేశం వాయిదా

తెలకపల్లి: మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో ఈ నెల 12 శుక్రవారానికి వాయిదా వేసినట్లు చెప్పారు.

మాజీ హోంమంత్రిని కలిసిన నాయకులు



కల్వకుర్తి రూరల్: కేంద్ర మాజీ హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే, రాజ్యసభ సభ్యులు సినీ నటుడు మోహన్‌బాబును కల్వకుర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌చారి కలిశారు. ఈ సందర్భంగా షిండేను శాలువాతో సత్కరించారు.

ఘనంగా హజ్రత్ షావలీ గంధోత్సవం



లింగాల: మండల పరిధిలోని మగ్దూంపూర్ హజ్రత్ సయ్యద్ షావలీ గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మూడు కిలో మీటర్ల దూరంలో మగ్దూంపూర్ దర్గా వరకు ర్యాలీగా గంధోత్సవాన్ని నిర్వహించారు. దర్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం దర్గా వద్ద అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

కొల్లాపూర్: వీఓఏలు చేపట్టిన సమ్మె 21వ రోజు కొనసాగింది. ఆదివారం సమ్మె శిబిరంలో వీఓఏలు కూర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు పెంచాలన్నారు. పానుగంటి నర్సింహ, అలివేల, మాధవి, సువర్ణ, గౌరమ్మ తదితరులున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వెల్దండ: మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. దీంతో రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయమై అనేక మార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేఎల్ఐ కాల్వ వెంట విద్యుత్ వైర్లు ఎత్తు తక్కువ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం చోటుచేసుకోకుండానే వైర్లను సరిచేసి రైతులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోరు మరమ్మతు చేయించండి



తెలకపల్లి: మండల పరిధిలోని కార్వంగలో బోరును వెంటనే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలోని పాఠశాల ఆవరణలోని బోరు కొంత కాలంగా మరమ్మతులకు గురై వృథాగా పడి ఉంది. పాఠశాల ఆవరణలోని బోరు నుంచి పాఠశాలతో పాటు గ్రామానికి నీటి సరఫరా అవుతుందని తెలియజేశారు. ఈ బోరుతో గ్రామంలో చాలా వరకు నీటి కొరత తీరుతుందన్నారు. వేసవిలో నీటి కొరత ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని గోపస్ లక్ష్మణ్ కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

తాడూరు: మండల కేంద్రం నుంచి ఎండబెట్ల మీదుగా చర్లఇటిక్యాలకు వెళ్లే ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు గుంతలమయమై ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. చర్లఇటిక్యాల సమీపంలో కల్వర్ట్ వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మారనున్న రూపురేఖలు



పథకానికి ఎంపికైన లింగాల మండలం అంబట్‌పల్లి ఉన్నత పాఠశాల

పాఠశాల మరింత బలోపేతం..



కేంద్రం ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న 'పీఎం శ్రీ' పథకంలో తమ పాఠశాల ఎంపిక కావడం చాలా గొప్ప విషయం. ప్రస్తుతం పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో సౌకర్యాలను కల్పించాం. వీటితో పాటు పథకం ద్వారా ఏర్పాటు చేసే సౌకర్యాలను పూర్తి స్థాయిలో వాడుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం.

– ఎండీ తాహెర్‌పాషా, హెచ్ఎం, అంబట్‌పల్లి ఉన్నత పాఠశాల

'పీఎం శ్రీ' పథకంలో చోటు

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కొత్తగా అమలు చేయనున్న 'పీఎం శ్రీ' పథకంలో పాఠశాల ఎంపికైంది. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలలను బలోపేతం చేయడం, కార్పొరేట్ తరహాలో విద్యను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించనుంది. ఈ పథకం అమలులో భాగంగా పాఠశాలకు అన్ని హంగులు కల్పిస్తారు. సోలార్ ప్యానళ్లు, ఎల్ఈడీ లైట్లు, ప్లాస్టిక్ రహిత, వ్యర్థపదార్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పోషకాహార తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు తదితర వాటిని కేంద్రం అమలు చేయనుంది. డిజిటల్ బోధనా శాస్త్రాన్ని ఉపయోగించడం కోసం ఐసీటీ, స్మార్ట్ క్లాస్ రూంలు, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కానున్నాయి. పాఠశాలలో వంద శాతం సైన్స్ మరియు గణితం కిట్లను అందుకుంటారు. ఆయా సౌకర్యాల కోసం కేంద్రమే నిధులను ఖర్చు చేయడం, 5 ఏళ్ల పాటు పథకం అమలులో ఉండటంతో పాఠశాల దశ, దిశ మారనుంది.

ఎంపికవడం గర్వంగా ఉంది..



మారుమూల ప్రాంతంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 'పీఎం శ్రీ' పథకంలో ఎంపిక కావడం తమ గ్రామానికి ఎంతో గర్వ కారణం. ఇప్పటికే పాఠశాల బలోపేతానికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి తోడుగా దాతలు చేయూత అందిస్తున్నారు. నేడు కేంద్రం ద్వారా సమకూరే నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం. – నాగ రవిశంకర్, సర్పంచ్ అంబట్‌పల్లి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 2002–03లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సమ్మేళనం నిర్వహించి గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఉపాధ్యాయులు వెంకటయ్య, సుధాకర్, హేమచంద్రుడు, సురేందర్, విద్యార్థులు శంకర్, వినోద్ రెడ్డి, సుఖజీవన్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటూ ప్రత్యేకించి మన్ననూర్‌లో 6 కేంద్రాలు ఉండగా.. వీటిలో కొన్ని కేంద్రాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు, లబ్ధిదారులు వాపోతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రోజువారీగా అందించే పౌష్టిక ఆహారం సక్రమంగా ఇవ్వకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం ఎంత మాత్రం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగా కొందరు టీచర్లు ఇష్టం వచ్చిన సమయానికి వస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భరోసా సభకు తరలిన నాయకులు



కల్వకుర్తి నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



తాడూరు నుంచి బయలుదేరిన నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భరోసా సభకు వివిధ గ్రామాల నుంచి బీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. సభకు జాతీయ అధ్యక్షురాలు ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. రామకృష్ణ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి బహిరంగ సభకు కల్వకుర్తి నుంచి బహుజన సమాజ్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఆంజనేయులు, చంద్రమ్మ, మల్లేష్, రేణుక, పర్వతాలు, భరత్ తదితరులు ఉన్నారు.

తాడూరు: హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా యాత్రలో పాల్గొనే బీఎస్పీ నాయకురాలు మాయావతి సభకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి ఆదివారం బీఎస్పీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు కుమార్, లక్ష్మణ్ మాట్లాడారు. ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి పెద్దఎత్తున సభను జయప్రదం చేసేందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పృధ్వీరాజ్, కల్యాణ్, బంగారయ్య, భరత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు మండలం నుంచి బీఎస్పీ శ్రేణులు వాహనంలో వెళ్లారు.

కంకర పోశారు.. నిర్మాణం మరిచారు

తాడూరు: మండలంలోని అంతారం, నాగదేవ్‌పల్లి, గోవిందాయిపల్లి మీదుగా ఐతోల్, మేడిపూర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి నెలలు గడుస్తున్నా.. నిర్మాణ పనులు చేపట్టడంలేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నందున వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని, అధికారులు రోడ్డు నిర్మాణంలో జాప్యం చేస్తున్నారని వాపోతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డుపై కంకర ఇలా..

ముమ్మరంగా ఉపాధి పనులు



బొల్లంపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

వెల్దండ: జాతీయ ఉపాధిహామీ పథకం పనులు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. వేసవి కావడంతో అధికారులు కూలీలందరికి ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తున్నారు. వెల్దండ మండలంలో ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులకు ఉపయోగపడేలా పంట పొలాలు చదును చేయుట, ముళ్లచెట్ల తొలగింపు, చెరువు, కుంటల్లో పూడికతీత తదితర పనులు చేపడుతున్నారు.

- మండలంలో మొత్తం 32 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పనులకు వెళ్తున్నవారందరికీ జాబ్ కార్డులు అందిస్తామని, ఇప్పటి వరకు 9,386 జాబ్ కార్డులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. వీటిలో ప్రతి వారం ఉపాధిహామీ పనులకు 4 వేల మంది కూలీలు పనులకు వెళ్తున్నట్లు పేర్కొంటున్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు కూలీ డబ్బులు వస్తాయని పేర్కొంటున్నారు.

డబ్బులు అందిస్తాం...



వేసవి కావడంతో గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీలు అధికంగా వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో నూతన పద్ధతి తీసుకురావడంతో ప్రతి 10మంది కూలీలకు ఒక మస్టర్ వస్తుందన్నారు. వారి పని దినాలను కంప్యూటర్‌లో నమోదు చేసి జిల్లాకు పంపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన వెంటనే కూలీలకు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. త్వరలోనే కూలీలందరికీ డబ్బులు అందిస్తాం.

–శ్రీనివాసులు, ఎంపీడీఓ, వెల్దండ

బీఆర్ఎస్ నేత మృతికి సంతాపం



అమ్రాబాద్: మండల పరిధిలోని కల్ములోనిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోరెటి రవికుమార్ గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ రాములు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. రవికుమార్ మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. రవికుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం, పార్టీ తరఫున అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ జగపతి మాతృమూర్తి కలమందల సుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. వారి కుటుంబాన్ని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ ఆదివారం జూపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామన్నారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వెంకటయ్య యాదవ్, బొజ్జయ్య, రామచంద్రి, రామస్వామి పాల్గొన్నారు.

పరామర్శించిన ప్రభుత్వ విప్

లింగాల: సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గోపాల్‌నాయక్ మాతృమూర్తి దేవసోత్తు జిజ్జాబాయి అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మహిళ అదృశ్యం

కల్వకుర్తి టౌన్: పట్టణంలో మహిళ అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కళ్యాణ్‌నగర్ కాలనీకి చెందిన వెంకటమ్మ ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది. మహిళకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, ఇతర చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని కుమారుడు మహేష్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్తులు ఆదివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని గ్రామపంచాయతీ వద్ద నిలిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిరుద్యోగులు తరలిరావాలి

బిజినేపల్లి: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే నిరుద్యోగ విద్యార్థి సంఘర్షణ సభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బంగరి పర్వతాలు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ఈ సభకు హాజరవుతున్న తరుణంలో నిరుద్యోగులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం

వెల్దండ: అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరిపంటలు నెలకొరిగాయి. దీంతో చేతికందె పంటలు అకాల వర్షాలకు నష్టం రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. కానీ ఎలాంటి పరిహారం అందించలేదని ఆందోళన చెందుతున్నారు. మండలంలో అజిలాపూర్, బండోనిపల్లి, కుప్పగండ్ల, భైరాపూర్, వెల్దండ తదితర గ్రామాల్లో రైతులు దాదాపుగా 60 ఎకరాల్లో వరిపంట, ఆముదం, మొక్కజొన్న తదితర పంటలను అంచనా వేశారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరుతున్నారు.



అజిలాపూర్‌లో నేలకొరిగ వరిపంట

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎం శ్రీనివాసులు

తెలకపల్లి: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఉన్న అన్ని రకాల అప్పులు, రూ.లక్ష రుణమాఫీ ఒకే సారి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే ముందే రుణమాఫీ చేయాలన్నారు. లేకుంటే రైతులు ప్రైవేట్, వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పులు చేసి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం కాంటాలు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు వారం రోజులలోపు డబ్బులు చెల్లించాలని కోరారు. జిల్లాలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు బకాయిలు ఉన్న రూ.కోట్ల తక్షణమే రైతులకు చెల్లించాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపస్ లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు బాలు, చంద్రమౌలి, రమేశ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఏదీ?

నాగర్‌కర్నూల్ రూరల్: అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నోటికాడికి వచ్చిన వరిపంట నేలరాలిందని, అమ్మకానికి తీసుకొచ్చిన వరిధాన్యం కూడా తడిసి ముద్దయి నష్టపోయారని ఆరోపించారు. మిల్లర్లు, కొనుగోలుదారులు ఒక్కటై తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్

దళితబంధుతో జీవితాల్లో వెలుగులు

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అందించిన దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండాయని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, రైతు సమితి అధ్యక్షులు వెంకటయ్య యాదవ్ అన్నారు. మండలంలోని జూపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో దళిత బంధులో లబ్ధిపొందిన డైరీ ఫాం యూనిట్లను సందర్శించారు. ప్రభుత్వం అందించిన సాయం సద్వినియోగం చేసుకున్నారని తెలియజేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గతంకంటె వారు ప్రస్తుతం దళితబంధుతో ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నట్లు లబ్ధిదారులు తెలియజేశారు. వారి సద్వినియోగంపై పలు సూచనలు అందించారు. గేదెల పశువైద్యంపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుని పశువైద్యుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. వారి వెంట రైతు సమితి మెంబర్ అంజయ్య, మల్లయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



గేదెల యూనిట్ వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెంకటయ్య యాదవ్

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



గుండాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వెల్దండ: మండల పరిధిలోని గుండాల వద్ద ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉదయం 10.30 నుంచి 12.30 గంటలకు ఆరో తరగతి ప్రవేశానికి 360మంది విద్యార్థులకు 320 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సరస్వతి పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటలకు 7, 8, 9వ తరగతి 186 మంది విద్యార్థులకు 169 మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, డిపాట్‌మెంట్‌ల ఆఫీసర్ లక్ష్మయ్య పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

తాడూరు: నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాడని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లికుమార్ విమర్శించాడు. ఆదివారం మండలంలోని యత్మాతాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని చంద్రయ్య గుడిసె విద్యుదాఘాతానికి గురై పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలోని వారికి ఎవరికి ఏమి కాలేదు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబాన్ని పరామర్శించాడు. నియోజకవర్గంలో ఒక్క గ్రామంలో కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీలన్ని నీటి మూటలా మిగిలిపోయాయన్నారు. జిల్లా స్థాయి అధికారులు గుడిసె దగ్ధమైన చంద్రయ్య కుటుంబాన్ని సందర్శించి ఆదుకోవాలన్నారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు పృధ్వీరాజ్, ఆనంద్, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కుమార్

కొనసాగుతున్న కార్యదర్శుల సమ్మె

తెలకపల్లి: పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల జిల్లా నాయకుడు భాస్కర్ మాట్లాడారు. 4 సంవత్సరాల ప్రొహిబిషన్ పిరియడ్ ముగిసినందున వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు.



తెలకపల్లిలో నిరసన తెలియజేస్తున్న కార్యదర్శులు

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ సాధ్యం



ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సాధ్యమవుతుందని, ఒకే సారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆదివారం మండలంలోని సుద్దకల్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అధికార పార్టీ చెబుతున్న అభివృద్ధి ఉట్టి బూటకమన్నారు. గ్రామంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్, అనిల్‌గౌడ్, నాగరాజు గౌడ్, బాలరాజు, అనిల్ కుమార్, సుదర్శన్ పలువురు పాల్గొన్నారు.